# అభిమానభంగం

తలుపు తీయగానే తానెప్పుడో స్మృతిపథం నుంచి చెరిపేసుకున్న శేఖర్‌ను ఇలా పన్నెండేళ్ళ తరువాత చూస్తాననీ, అదీ భర్త స్నేహితుడిగా, ఇంటికి భోజనానికి వచ్చిన అతిధిగా చూడాల్సి వస్తుందని ఎదురుచూడని జయంతికి ఒక్కసారిగా షాక్ తగిలినట్లనిపించింది. కానీ అది ఒక్క అరక్షణం మాత్రమే. అతని ముఖంలో కనిపించిన బెదురు, భయం, తత్తరపాటు అతనూ షాక్ అయ్యాడని చెప్పాయి. తననిక్కడ స్నేహితుని భార్యగా చూసిన అతని స్థితి అర్థం అయింది జయంతికి. అతని ముఖం మాడిపోయింది. గాబరా పడిపోయాడు. ఇద్దరినీ ఒకరినొకరికి పరిచయం చెయ్యాలనుకున్న జయంతి పతిదేవుడు కృష్ణమూర్తి ఇద్దరినీ వింతగా చూశాడు. మరుక్షణం అతని ముఖం మాడింది. తామిద్దరి ముఖాలు మాడాయంటే అర్థం ఉంది. ఈయనగారి ముఖం ఎందుకు మాడింది చెప్మా, ఆప్తమిత్రుడు తాను చేసిన ఘనకార్యం మిత్రునికి చెప్పుకున్నాడేమో తాను అతని భార్యనని తెలియక ఆఫీసునుంచి ఇంటికి కారులో వస్తూ స్నేహితునికి చాలా గొప్పగా చేసిన వెధవపని చెప్పాడేమో, చెప్పుకుని ఇద్దరూ ఓ ఆడకూతుర్ని ఏడిపించి, శాస్తి చేశామని గర్వంగా నవ్వుకుని ఉంటారు. తీరా ఇంటికి వచ్చాక ఆ ఆడకూతురు ఎవరో కాదు అన్నది ఇద్దరికి అర్థం అయి షాక్ అయినట్లున్నారు.

"మధ్యాహ్నం పదకొండు గంటల వేళ ప్రాణస్నేహితుడు చంద్రం ఊరికి వచ్చి కలిశాడు. లంచ్‌కి తీసుకొస్తున్నాను. వంట బాగా చేయి, వాడు భోజనప్రియుడు" అంటూ మిత్రుని ఇష్టాయిష్టాలు ఏకరువు పెడితే జయంతికి చిర్రెత్తింది. వంట పూర్తిచేశాక మళ్ళీ వండడం. ఆఫీసులో ఎవరో కోలీగ్ ఏక్సిడెంట్‌లో పోతే ఇచ్చిన సెలవు ఇలా వండిపెట్టడానికా అన్నట్లు చిరాకు వచ్చింది. కానీ, భర్తగారి స్నేహితుడాయె. కాదనడం ఎలా? ఆ చంద్రంగాడే ఈ చంద్రశేఖరుడని ఊహించలేక పోవడం తన తప్పా.

అందరికన్నా ముందు తేరుకున్న జయంతి దారి తొలగి అతిధిని ఆహ్వానిస్తున్నట్లు రాని నవ్వు నవ్వింది. కానీ, అతిధిదేవుడు బెదురుగొడ్డులా లోపలికి వచ్చే సాహసం చేయలేనట్లు చెమటలు కార్చుకుంటూ, "సారీ.. సారీరా... ముఖ్యమైన అపాయింట్‌మెంట్ ఉంది. మర్చిపోయాను. సారీ ఫర్ ద ట్రబుల్, సమదర్ టైమ్" అంటూ మొహం చూపలేనట్లు తల దించేసుకుని పరిగెత్తినట్లే వెళ్ళి టాక్సీ ఎక్కేశాడు. పతిదేవుడు ఏమి

అనే లోపలే, అనే అవకాశం ఇవ్వకముందే, టాక్సీ కదిలి పోయింది. పిరికిపంద. అలా పారిపోవడం ద్వారా అతను చేసిన వెధవపనికి మిత్రునికి మరింతగా తెలుస్తుంది అన్న ఇంగితజ్ఞానం కూడా లేనట్లుంది.

వెళ్ళిన టాక్సీ నుంచి దృష్టి మరల్చి భార్య వైపు చూశాడు కృష్ణమూర్తి, జయంతి నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వి, "ఏమయింది మీ స్నేహితునికి, ఎందుకలా పరిగెత్తాడు?" కించిత్తు హేళన మేళవించి అంది జయంతి. పతిదేవుడు అనుమానంగా భార్యవంక చూశాడు. "వీడు నీకు తెలుసా?" అదోలా చూస్తూ అడిగాడు.

"ఆఁ.. తెలుసు." వెనుదిరిగి లోపలికి నడుస్తూ నిర్లక్ష్యంగా అంది జయంతి.

"ఎలా తెలుసు?"మరో అనుమానపు చూపు.

"కాలేజీలో నా సీనియర్". టేబిల్ మీద ప్లేట్లు, గ్లాసులు సర్దుతూ అంది.

"చంద్రం నీకు బాగా తెలుసా?"

"బాగా అంటే అర్థం. కాలేజీలోకి నేను బి.ఎస్సీ మొదటి సంవత్సరంలో చేరినప్పుడు అతను ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు."

"అంతేనా!"

క్రాస్ ఎగ్జామిన్ మొదలైంది. జయంతి కృష్ణమూర్తి వంక సూటిగా చూసి, "అంతేనా అంటే, ఇంకా ఏముందనా" అంది.

"ఆఁ.. అదే అడుగుతున్నాను. కాలేజీలో క్లాస్‌మేట్ అయితే పాత స్నేహితులని చూసి ఆనందిస్తాం. ఇన్నాళ్ళకి కల్సుకున్నాం అని సంతోషపడ్తాం. కానీ, చంద్రం ఎందుకలా గాబరా పడిపోయాడు?" కుర్చీజరిపి కూర్చున్నాడు భార్యను పట్టిపట్టి చూస్తూ.

జయంతి కోపంగా చేతిలో గరిట టేబిల్ మీద పడేసి, "ఈ ప్రశ్నఅడగవలసింది అతణ్ణి. పారిపోయింది అతను కాబట్టి, ఈ క్రాస్ ఎగ్జామిన్ అతణ్ణి చెయ్యండి" అంది తీవ్రంగా చూసి.

కృష్ణమూర్తి ముఖం మాడ్చుకొని, "వాడు నిన్ను చూసి గాబరా పడిపోయాడు అంటే దానర్థం మీ ఇద్దరి మధ్య ఏదో జరిగుంటుంది అతనికి. నీకు మధ్య..." కృష్ణమూర్తి జయంతిని నిలేస్తున్నట్లు అడిగాడు.

"అతనికీ, నాకూ మధ్య ఏం జరిగుంటుందని మీ ఉద్దేశం." జయంతి చాలా నిబ్బరంగా, అన్నం కలుపుకుంటూ అంది.

"నాకేం తెలుసు. నీకు తెలియాలి. అందుకే అడుగుతున్నాను." హేళనగా అన్నాడు.

"మా ఇద్దరిమధ్య ఏం జరిగిందో అతను మీకు చెప్పే ఉంటాడు. అఫ్‌కోర్స్ ఆ 'నేను' ఈ 'నేను' ఒకరే అని తెలియక ఆప్తమిత్రునికి చెప్పే ఉంటాడు. మళ్ళీ అడగడంలో మీ ఉద్దేశం ఏమిటి?" జయంతి తీక్షణంగా అంది. ఈసారి కృష్ణమూర్తికి కోపం వచ్చేసింది ఆ నిర్లక్ష్యానికి, ఆ పొగరుగా జవాబిచ్చిన తీరుకి భర్తగారికి కోపం వచ్చింది. భార్య గాబరాపడలేదు. భయపడలేదు. తప్పుచేసిన దానిలా తలదించుకోలేదు. జరిగింది దాచాలని ప్రయత్నించలేదు. మొగుడేం అంటాడో, అనుకుంటాడో అన్న బిడియం లేదు. తన కాపురం ఎలా తగలడ్తుందన్న భయం అసలే లేకుండా అలా నిర్లక్ష్యంగా దులిపేసుకుని, ఒంటిమీద ఈగ వాలితే దులుపుకున్నంత తేలిగ్గా అనేయడం భరించలేకపోయాడు.

"మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కి ఏడ్చినట్టుంది. నీవరస. జరిగిందానికి సిగ్గుపడడం పోయి నామీద ఎగురుతున్నావు" ముఖం ఎర్ర పర్చుకుని అరిచాడు.

"జరిగిందానిలో నా బాధ్యతలేదు. నా తప్పు అసలే లేదు. నేనెందుకు సిగ్గుపడాలి. సిగ్గు పడాల్సింది మీ మిత్రుడు. నేను మొగుణ్ణీ కొట్టలేదు. మొగసాల ఎక్క నలుగురినీ పిలిచి చెప్పనూ లేదు..."

"అవును చెప్పకుండా, ఎవరికీ తెలియకుండా, గుట్టుచప్పుడు కాకుండా దాచేసి తగుదునమ్మాఅని నన్ను పెళ్ళాడేసావు. ఇప్పుడు వీడు గనక రాకపోయి ఉంటే, వాడు నా స్నేహితుడు కాకపోయి ఉంటే, వాడు నిన్ను చూడకపోయి ఉంటే మహాచక్కగా పతివ్రతలా నటించేసే దానివి లైఫంతా"

"ఆఁ... నేను పతివ్రతనే. నే మిమ్మల్ని పెళ్ళిచేసుకున్నాక పరాయి పురుషుణ్ణి చూడలేదు. ప్రేమించలేదు. తాకలేదు." జయంతి వ్యంగ్యంగా అంది.

"అంటే పెళ్ళికి ముందు ఏం జరిగినా ఫరవాలేదనా నీ ఉద్దేశం? అవేమీ పెళ్ళాడేవాడికి చెప్పక్కర్లేదనా నీ ఉద్దేశం?"

"నా పెళ్ళికి ముందు ఎన్నో సంఘటనలు జరిగాయి. ఇరవైమూడేళ్ళలో అవన్నీ వరుసగా టైం రాసుకుని చూపించాలని నాకు తెలియదు. ఇరవైమూడేళ్ళలో ఎన్నో దెబ్బలు తగిలాయి. ఎన్నిసార్లో పడ్డాను. ఒకసారి చెయ్యి విరిగింది. ఒకసారి పడి పన్ను విరగ్గొట్టుకున్నాను. ఓసారి టైఫాయిడ్ వచ్చి పరీక్షకి వెళ్ళక ఫేలయ్యాను. ఓ సారి మా అత్తకొడుకు మెట్టు దిగుతుంటే వెనకనుంచి కౌగిలించుకుంటే దవడ మీద ఒకటిచ్చాను. ఓసారి సినిమాహాల్లో ఓ వెధవ వెనుకనుంచి నా నడుం మీద వేళ్ళు ఆడించాడు. ఓసారి బస్సులో వస్తుంటే మరోవెధవ అంతకంటే చెత్తపని ఇంకోటి చేశాడు. ఓసారి నా గొలుసు

పారేసుకొని అమ్మచేత దెబ్బలు తిన్నాను. ఓసారి స్కూటర్‌మీద వెళ్తుంటే కిందపడ్డాను...

"ఆపు, తెలివిగా మాట్లాడుతున్నానని అనుకోకు. ఈ పడడాలు, దెబ్బలు తగలడాలు, చెయ్యి విరగ్గొట్టుకోవడాలు వీటన్నింటి గురించి ఎవరూ అడగలేదు. ఇవన్నీ ముఖ్యమైన విషయాలు కావు." కోపంగా అన్నాడు.

"నా దృష్టిలో అదో ముఖ్యమైన విషయం కాదు. అందుకే చెప్పలేదు. అదీ నాలుగు రోజులలో దెబ్బ నయం అయిపోయినట్లే మర్చిపోయే యాక్సిడెంట్ అనుకున్నాను."

జయంతి మాటలకు విస్తుపోయి చూశాడు కృష్ణమూర్తి. అతనికి కోపంతో మాటలు తడబడి పోయాయి. ఒకభార్య భర్తతో ఇంత నిబ్బరంగా, నిర్లక్ష్యంగా మాట్లాడడం సహించలేకపోతున్నాడు. సిగ్గుపడి, బెదరిపోయి తప్పయింది అని ప్రాధేయపడకుండా జరిగింది అవమానం అనుకోకుండా చెయ్యి విరిగిందన్న విషయం అంత మామూలుగా ఆ విషయం తీసుకొని మాట్లాడడం అతను ఎదురుచూడని విషయం. ఓ ఆడదాన్ని ఓ మగాడు బలాత్కారం చేశాడంటే శీలం పోవడం. ఇంత తేలిక విషయంగా మాట్లాడుతున్న జయంతినీ, ఆమె నిబ్బరాన్ని చూసి నోట మాటరానట్లుండి పోవడం అతని వంతయింది.

"నీకు... నీవు... నిన్ను ఓ మగాడు మానభంగం చేస్తే..." అతని మాట పూర్తికాలేదు. జయంతి భద్రకాళిలా అరిచింది.

"స్టూపిట్, డోన్ట్ యూజ్ దట్ వర్డ్." తర్జని చూపించి బెదరిస్తూ కళ్ళెర్రజేసింది. ఆ 'మానభంగం' అన్నమాట వాడొద్దు. మానం.... దానికి భంగం.. అంతా ట్రాష్. మీ ఫ్రెండ్. నీచుడు నామీద బలప్రయోగం చేశాడు. బలాత్కారం చేశాడు. ఆవెధవ. ఒళ్ళు బలిసిన ఆ వెధవ ముందు శారీరకంగా బలహీనురాలినయి వాడి ముందు ఓడిపోయాను. దీనికి మానభంగం అన్న పేరు వాడకండి. అదీ నా దృష్టిలో ఓ యాక్సిడెంటే. నా ఇష్టం లేకుండా, నా ప్రమేయం లేకుండా, శారీరకబలంతో లొంగదీసుకోవడం ఇదీ ఒక యాక్సిడెంటే.అంతే తప్ప నేనేదో శీలం, పవిత్రత పోగొట్టుకున్నానని భావించలేదు. నేను కావాలను కోనిది నా మీద బలవంతంగా రుద్దబడడంలో నా తప్పులేదు కనుక,. ఇది నా జీవితంలో తిన్న దెబ్బలలో ఒకటి. అంతే."

"అంటే చెయ్యో, కాలో విరగడం ఇదీ ఒకటేనా? ఇది నా దగ్గర దాచి నీవు, మీ వాళ్ళు, నన్ను మోసం చేయడం ఎంత దగా, ఎంత కుట్ర." ఉక్రోషంగా అన్నాడు.

"ఆగండి. ఇందులో మా వాళ్ళని అనాల్సిందేం లేదు. ఎందుకంటే, వాళ్ళకి అసలు ఈ విషయమే తెలీదు."

కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు.

ఓహో, ఎంత జాణవి నీవు. ఇంట్లో వాళ్ళకి కూడా ఇది ఇంత గుట్టుగా దాచిపెట్టగలిగావంటే శభాష్, నిన్ను మెచ్చుకోవాలి. నీ గుండె ధైర్యాన్ని అభినందించా?" వ్యంగ్యంగా అన్నాడు. "వాళ్ళతో చెప్పకపోయినా కట్టుకున్నవాడికి నా దగ్గిర చెప్పక్కరలేదనుకున్నావా? పెద్ద పవిత్రంగా చలామణి అయిపోవాలనుకున్నావా? నీవే నిజాయితీపరురాలి వైతే నాకు చెప్పేదానికి ముందుగా."

"చెప్పానుగా. ఇది నా దృష్టిలో శారీరకంగా తగిలిన దెబ్బ మాత్రమే. అందుకని దీనికి నేను ప్రాముఖ్యం ఇవ్వలేదు. జరిగిందాన్ని చెప్పి వాళ్ళని అనవసరంగా బాధ పెట్టడం అనవసరం అనిపించి వాళ్ళకీ, మీకు చెప్పలేదు. నేను కావాలని ఇంకెవరినో మానసికంగా ప్రేమించి, వాడితో శారీరక బంధం ఏర్పరచుకొని, అది దాచి మిమ్మల్ని పెళ్ళాడి ఉంటే అది తప్పు నా దృష్టిలో. అసలు పెళ్ళికాక ముందు అనేకం జరుగుతుంటాయి. మీరు ఎందరో అమ్మాయిల వెంట పడుండవచ్చు. ఉత్తరాలు రాసి ఉండవచ్చు. లంచ్‌లకి, డిన్నర్లకి వాళ్ళను తీసికెళ్ళి ఉండవచ్చు. కానీ, అనేక కారణా వల్ల పెళ్ళి చేసుకోలేక పోయుండవచ్చు, అవన్నీ మీరు పెళ్ళాడే ముందు అమ్మాయిలతో నిజాయితీతో చెబుతున్నారా. చాలా బుద్ధిమంతుల్లా పెళ్ళిపీటలెక్కుతారు. పెళ్ళికి ముందు మేమూ ఏ కాలేజీ అబ్బాయి ప్రేమలేఖలో అందుకొని ఉండవచ్చు. మేమూ బాయ్‌ఫ్రెండ్స్‌తో హోటలుకెళ్లి కాఫీ తాగి ఉండచ్చు. అబ్బాయిలు, అమ్మాయిలు కలసి మాట్లాడుకోవడం తిరగడం, ఇంకా కొందరు కాస్త ముందుకెళ్ళి అబ్బాయిల లేకి మాటలకు లోబడి ప్రేమిస్తున్నాం అనుకొని విరహగీతాలు పాడుకొని ఉండవచ్చు. ఇదంతా ప్రతివాళ్ళ లైఫ్‌లో సర్వసామాన్యం యౌవనంలో. ఇదంతా తప్పు పరమ అపరాధం అని ఎవరూ అనుకొని పెళ్ళికి ముందు'కన్‌ఫెస్' చేయరు. ప్రేమించామని కడుపులు చేసినవారు పెళ్ళివేళకి వచ్చేసరికి ముఖం చాటేయడాలు, దొంగచాటుగా కడుపులు దించుకొన్న అమ్మాయిలు - రకరకాల కథలుంటాయి ప్రతివారి వెనుక. ఆ యౌవనంలో జరిగినవన్నీ అందరూ రబ్బరుతో చెరిపేసుకున్నంత తేలిగ్గా చెరుపుకొని కొత్తజీవితాలు అరంభించుకుంటారు. నేను అలాంటివేం చెయ్యలేదు. ఓ పొగరెక్కిన వెధవ తన డబ్బు, హోదా ఎరచూపి ప్రేమ పేరుతో వెంట తిప్పుకోవాలనుకుంటూ వెర్రి వేషాలు వేస్తే లొంగక పోయేసరికి పౌరుషం, అవమానం వచ్చి నాకు బుద్ధి చెప్పడానికి తన బలం చూపి లొంగదీసుకున్నాడు. అది నాకు అవమానం అనుకున్నాను తప్ప తప్పని, పవిత్రత, శీలంలాంటివి పోయాయని నేను ఎప్పుడూ బాధపడలేదు. అందుకే చెప్పనవసరం లేదనుకున్నాను.

"దెబ్బ తగిలిందన్నంత తేలిగ్గా దులిపేసుకుని ఊరుకున్నావన్నమాట" వ్యంగ్యంగా

ఎత్తిపొడిచాడు.

"లేకపోతే ఏం చెయ్యాలిట! ఊరూ వాడా అరిచి చెప్పి, పోలీస్ రిపోర్ట్ ఇచ్చి కోర్టుకెక్కి రొస్టుపడాలా! కోర్టులకి చూపాల్సిన సాక్షాలూ నా దగ్గర లేవు. కోర్టులు ఏ మాత్రం న్యాయం చేస్తున్నాయో చూస్తున్నాంగా. కోర్టుకెక్కే ధైర్యం నాకున్నా, న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేక.."

"కోర్టుకెక్కనక్కరలేదు. కానీ, అంత తేలిగ్గాఏ ఫీలింగ్సూ లేకుండా దులిపేసుకున్నావంటే... నీ గుండె ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందే."

"ఏ ఫీలింగ్సూ కలగలేదని నేను చెప్పానా! నాకిష్టం లేకుండా శారీరక బలంతో నా శరీరాన్ని బలవంతంగా లొంగదీసుకున్నాడన్న కసి, ద్వేషం, అవమానం, సిగ్గుతో నా మనసు, శరీరం దహించుకుపోయాయి. ఏ చెత్తవెధవో వాడి 'అశుద్ధం' నా ఒంటినిండా పామినంత అసహ్యం, జుగుప్స, చీదరింపు కలిగింది. ఆ వెధవ వాడిన ఈ శరీరాన్ని ఎలా శుభ్రపరచుకున్నానో తెలుసా? ఒక బాల్చీడు వేడినీళ్ళలో అరసీసాడు డెట్టాల్ వంపాను. పెరట్లోంచి దోసెడు వేపాకులు కోసుకొచ్చి నీళ్లలో వేసాను. అది చాలనట్లు గుప్పెడు పసుపు నీళ్ళలో వేసి తలారా స్నానం చేశాను. కొబ్బరి పీచుతో ఒళ్ళు మంటలెక్కేవరకు తోమాను. తరువాత మరో బాల్చీడు నీళ్లలో గుప్పెడు తులసాకులు, దేముడి దగ్గర గంగ చెంబులో సగం గంగ చెంబు వంపి దేహాన్ని డిసిన్‌ఫెక్ట్ చేసుకుని తరువాత రెండో బాల్చీ నీళ్ళు తలనిండా వంపుకున్నాను. అప్పటికి శరీరాన్ని అంటిన మైల తొలగిందనిపించింది.. మానసికంగా పడిన అవమానం తొలగించుకోవడానికి తడిబట్టలతో వెళ్ళి దేవుడి ముందు దీపం వెలిగించాను. దాంతో శారీరకంగా, మానసికంగా ప్రక్షాళన జరిగినట్టు తృప్తిపడ్డాను." స్థిరంగా అంది.

కృష్ణమూర్తి భార్యవంక వింతగా చూశాడు. ఆశ్చర్యంగా విన్నాడు. ఏమనాలో తెలియక మాటలకి తడుముకున్నాడు. జరిగిందానికి కోపగించుకోవాలో, భార్యకి సానుభూతి చూపాలో అన్నది కూడా అతనికి అర్థం కాలేదు. "ఇలా ఎందుకు చేశాడు చంద్రం?" గొణిగాడు. చివ్వున తలెత్తి రోషంగా చూసింది జయంతి.

"ఎందుకంటే మీ మగాళ్ళకి ఓ ఆడది తనని లెక్కచేయకపోతే పౌరుషం వచ్చేస్తుంది. అవవమానం అనిపిస్తుంది. తన డబ్బు, అందం, హోదాని నేను కేర్ చేయ్యలేదన్న ఉక్రోషం..."

"అసలు ఇదంతా ఎందుకు, ఎలా జరిగింది?"

"మీ ఫ్రెండ్ చెప్పాడేమో, మళ్ళీ ఎందుకు అడుగుతారు," తీవ్రంగా అంది.

"నీ వర్షన్ విందామని, మా కామన్ ఫ్రెండు ఒకడు వీడు కాలేజీలో చేసింది చెప్పాడు. వీడు సరిగా చెప్పలేదు." కుతూహలంగా చూశాడు.

ఏం జరిగింది? పధ్నాలుగేళ్ళ క్రితం,. కాలేజీలో చదువుకునే టీనేజ్ వయసు - తళుకు, బెళుకు, వగరు, పొగరు ఉండే వయసులో ఓ ఆడపిల్ల. అందులో అందంగా ఉండే ఓ అమ్మాయి.... ఎంతో హాయిగా, ఆనందంగా, తుళ్ళుతూ ఆడేపాడే వయసు అమ్మాయి.. కలలు కనే వయసు- కలల్లో రాకుమారుడు, అజానుబాహుడు, అరవింద దళయతాక్షుడు, ఉన్నతుడు, సంస్కారుడు, ప్రేమించేవాడు, అలరించేవాడు, మైమరిపించేవాడు. తానే లోకంగా భావించేవాడు వస్తాడని, వరమాల వేస్తాడని, మురిపాల సంసారం గురించి ప్రతి అమ్మాయి ఊహించి కలలు కనే వయసు అది! మగవాడంటే హుందాగా ఉండాలి, హుందాతనంలో సెన్సాఫ్ హ్యూమర్ ఉండాలి. తెలివిగా, చదవాలి, ఆడపిల్లలంటే గౌరవించాలి, లేకిగా ఉండకూడదు, చీప్‌గా ప్రవర్తించరాదు - అలాంటి అబ్బాయిలనే అమ్మాయిలు లైక్‌చేస్తారు. ప్రేమిస్తారు, గౌరవిస్తారు అని కొన్ని స్థిరాభిప్రాయాలు ఏర్పరచుకునే వయసు అది. తమ ఊహలకి భిన్నంగా ఎవడైనా ప్రవర్తిస్తే తిరస్కారం కలుగుతుంది. అదే జరిగింది చంద్రశేఖర్‌ని చూసిన క్షణంలో జయంతికి.

జయంతి కాలేజీలో చేరిన మొదటిరోజే శేఖర్ కళ్ళు ఆమెమీద పడ్డాయి. తండ్రి గవర్నమెంట్ ఉద్యోగి ట్రాన్స్‌ఫరయి వచ్చి కాలేజీలో కొత్తగా బి.ఎస్సీలో చేరింది. మొదటిరోజే ఆమె అందం అతన్ని ఆకర్షించింది. రోజుకో డ్రస్సుతో మోటార్‌సైకిల్‌మీద అంతెత్త బూట్లతో ఫ్రెండ్స్‌ని వెంటేసుకు తిరిగే శేఖర్ చదువులో మాత్రం వెనుకే. ఏదో డిగ్రీ కావాలని చదవడం తప్ప, తండ్రి బిజినెస్‌లు చూసుకుంటే చాలు, కష్టపడి డిగ్రీలు మీద డిగ్రీలు సంపాదించే పెద్దచదువులు అక్కరలేదన్న ధీమా. దాంతో అటెండెన్స్‌కి మాత్రమే కాలేజి, చదువుకి కాదు అన్న గ్రూప్ అంతా కలిసి ఆడపిల్లల్ని ఆకర్షించడానికి పాట్లు పడడం, ఆకర్షణకి లొంగినవాళ్ళతో షికార్లు, సినిమాలు, హోటళ్ళు తిరిగే గ్యాంగు అది. వీళ్ళ గురించి నెల రోజులకే జయంతికి అర్థమైంది. అర్థం కానిది ఉంటే సీనియర్లు చెప్పారు. అలా శేఖర్ అంటే మొదట్లోనే తేలికభావం ఏర్పడిపోయింది. అతను రోజురోజుకీ ఆమెపట్ల ఆకర్షితుడైనకొద్దీ ఆమెకి అతనిపట్ల ఏహ్యత రోజురోజుకి పెరిగింది. అతన్ని చూడగానే ముఖం చిట్లించుకొనేది. అతని వెకిలివేషాలను తిరస్కారంగా చూసేది. అది అతని అహాన్ని రెచ్చగొట్టింది. తనలాంటి అందగాడు, డబ్బున్నవాడు ఆమె కోసం, ఆమె స్నేహం కోసం ఆరాటపడుతుంటే లెక్కలేనట్లే విదుల్చుకుని తనవైపు కన్నెత్తి అయినా చూడకపోవడంతో అతని అహం దెబ్బతింది.

"ఏమనుకుంటోంది. బోడి.... దీనిపాటి నాకెవరూ దొరకరనుకుంటోంది గాబోలు.. ఏదో పెద్ద అందగత్తెనని గర్వం...."

"నే తల్చుకుంటే దీని పొగరు నిమిషంలో అణుస్తా. పలకరిస్తే ముఖం తిప్పుకుని వెళ్ళి పోతుందా. పుస్తకం అడిగితే విసురుగా లేదంటుందా, చూస్తున్నా దీని వరస." మిత్రుల దగ్గర ఉక్రోషం వెళ్ళగక్కేవాడు. మిత్రబృందం నాలుగు సమిధలు వేసి మంట ఎగదోసేవారు. స్నేహితుల చెల్లెళ్ళ ద్వారా రాయబారాలు నడిచాయి. "పాపం ఆ శేఖర్ నీవంటే పడిచస్తున్నాడే పాపం అంతలా వెనకబడ్తుంటే మాట్లాడితే నీ సొమ్మేం పోతుంది.' స్నేహితురాళ్ళ వకాల్తా పుచ్చుకున్నట్లు మాటలు - "ఛా...వాడిని చూస్తేనే నాకు తిక్క రేగుతుంది. చదువూ సంధ్యాలేకుండా, రోజుకో డ్రస్సు వేసుకుని మోటార్ సైకిళ్ళ మీద తిరగడం గొప్ప అనుకుంటాడు కాబోలు. అది చూసి ఆడపిల్లలు వలలో పడిపోతారనుకుంటున్నాడేమో. వాడి సంగతి నా దగ్గిర చెప్పొద్దు." అసహ్యం అంతా మాటల్లో ముఖంలో చూపించింది.

ఆ కబురు శేఖర్ దగ్గరికి చేరింది. అవమానం జరిగిపోయినట్లు ఉడికిపోయాడు. మిత్రలు మరింత ఎగదోశారు. "వాడి బాబుకి రెండు ఫ్యాక్టరీలుంటే నాకేం, మూడు కార్లుంటే నాకేం. అవన్నీ వాడి బాబుకున్నాయి. వీడికేం ఉందట. చదివిఅవన్నీ వాడు సంపాదిస్తే అప్పుడు వస్తుంది గౌరవం. తండ్రి డబ్బుతో షోకులు చేసుకు తిరగడం కాదు" అందిరా. "చూస్తున్నా వాడి వ్యవహారం, సిగ్గు లేకుండా ఆడపిల్లల్ని ఏడిపించడం, కామెంట్స్ పాస్ చేయడం గొప్ప అనుకుంటున్నాడేమో. అది వాడికి సంస్కారాన్ని తెలుపుతుంది." లాంటి కబుర్లు అన్నీ విన్న శేఖర్ మొహం అవమానంతో మాడిపోయేది. జయంతి తిరస్కారం అతనిలో కక్షరేపింది. తనని గడ్డిపోచలా తీసిపారేయడం సహించలేకపోయాడు. తాను గడ్డిపోచ కాదన్నది ఆమెకి అర్థం అవాలన్న పంతం పెరిగింది. ఆమె అహం అణచాలన్న ప్రతీకార వాంఛ రోజురోజుకీ పెరిగింది. అదను కోసం వేచాడు. ఆమె ఇంటిల్లిపాదీ మిత్రులతో యాదగిరిగుట్ట వెళ్ళారు. జయంతి పరీక్షలని ఒంటరిగా ఉండిపోయింది చదువుకుంటూ. మిత్రులు కబురు అందించారు. నాలుగు గంటలవేళ ఎవరూ చూడకుండా తలుపు తట్టాడు. ఎవరో అని తలుపు తీసిన జయంతికి మాట్లాడే అవకాశం గాని, అరిచే అవకాశం గాని, ప్రతిఘటించే అవకాశం గాని ఇవ్వకుండా వెంట తెచ్చుకున్న రుమాలు నోట్లోకుక్కి, తెచ్చిన తాడుతో చేతులు కట్టి, ఆమె మీద కక్ష తీర్చుకున్నాడు. ఆమె కళ్ళల్లో నిస్సహాయత్వం అతని అహాన్ని అణిచింది. ఆమె కంట తిరిగిన నీరు ప్రతీకార జ్వాలని చల్లార్చింది. "మగాడి అహంతో ఎప్పుడూ ఆడుకోకు' 'వెళ్ళేముందు వార్నింగ్ ఇచ్చాడు. "నామీద కంప్లైంట్ ఇస్తే పోయేది నీ పరువే. నే

చేశాననడానికి నీకే సాక్ష్యంలేదు. కోర్టుకి సాక్ష్యం కావాలి. పోలీసులని కొనగలిగే డబ్బు మాకుంది కనుక కంప్లెంట్ చేసి ఫూల్‌వి అవకు" లాంటి ఉచిత సలహాలు పారేసి రుమాలు, తాడు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

అప్పటి జయంతి స్థితి వర్ణించడానికి మాటలు లేవు. ఒకగంట దిమ్మెరపోయి ఆలోచనారహితంగా కూర్చుండిపోయింది. మరోగంట ఆవేశంలో రకరకాలుగా ఏంచేయాలి అన్నది ఆలోచించింది అన్ని కోణాల నుంచి. కోర్టుకు కళ్ళులేవు. చెవులు తప్ప. పోలీసులకి చెప్పడం అంటే తన, తనవారి పరువు పేపర్లో వేయించుకున్నట్లే. వాడు పొగరుగా చెప్పినా నిజమే చెప్పాడు. తనేం చెయ్యలేదని వాడికి తెలుసు. నిజం చెప్పి తల్లితండ్రులని బాధపెట్టి, నలుగురిలో నవ్వులపాలవడం తప్ప ఒరిగిందేం లేదు. ఇదే ఏ బయటెక్కడో అయితే అందరికీ తెలిసేది. కొందరయినా తన మాట నమ్మేవారు. కొన్నయినా సాక్ష్యాలు చూపగలిగేది. కానీ, తన ఇంట్లో... ఎంత తెలివిగా ప్లాన్ అమలు చేశాడు. తనే పిలిచింది అని చెప్పినా చెప్పగలడు. ఇప్పుడు ఇది బయటికి చెప్పి తాను ఫూల్ అవడం తప్ప వాడన్నట్లు ఏం జరగదు. ఆవేశాన్ని వివేకం అణిచింది. అందరూ ఇంటికి వచ్చేసరికి ఇల్లు, మనసు, శరీరం యథాప్రకారంగా మార్చింది. "ఇప్పుడేమిటే తల స్నానం చేశావు?" ఇంటికొచ్చిన తల్లి ఆశ్చర్యంగా అడిగింది. "చదివి చదివి బుర్ర వేడెక్కింది. చెమట పట్టి చీదరగా ఉందని స్నానం చేశా"

"ఎప్పుడూ లేనిది దేవుడికి దీపంపెట్టావు. ఈ భక్తి ఎప్పటినుంచి?" తేలిగ్గా నవ్వి అంది.

ఆరోజుతో ఆ సంఘటన మర్చిపోవాలని ప్రయత్నించింది. కానీ, శేఖర్ మర్చిపోనివ్వలేదు. గిల్టీకాన్షస్ మనసుని తినేస్తుంది కాబోలు. ఏదో ఆవేశంలో చేసినా మర్నాడు జయంతిని చూడడానికి ముఖం చెల్లలేదు. ఏం గొడవ చేస్తుందోనని భయపడ్డ అతను జయంతి ఏం జరగనట్టే ఉండిపోవడంతో ఆశ్చర్యపడ్డాడు. పైకి ఎంత నిర్లక్ష్యం నటించినా జయంతి ముఖంలో పూర్వపు చలాకీతనం, ఆ కళ్ళలో ఆత్మవిశ్వాసం కోల్పోయినట్లుండడం చూసి అతనిలో ఆత్మవిమర్శ, తప్పుచేశానన్న భావం మొదలైంది. ఆగలేక జయంతిని క్షమించమని కోరుతూ మనం పెళ్ళిచేసుకుందాం, నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను అంటూ రాశాడు పశ్చాత్తాపం కనబరుస్తూ.

"నిన్ను పెళ్ళాడేకంటే వీధినపోయే ముష్టివాడిని పెళ్ళాడతాను. నా జోలికిరాకు. మరో ఉత్తరం రాయకు. రాస్తే నా శవం చూస్తావు. చచ్చేముందు నీవు చేసిన పని అందరికీ తెలిసేటట్లు చేసి మరీ చస్తాను. ఇది నిజం" అంటూ రాసింది. దాంతో శేఖర్ బెదిరాడు. జయంతి జోలికి వెళ్ళడం మానేశాడు. ముళ్ళమీద ఉన్నట్లు మూడు నెలలు

గడిపి పరీక్ష రాశాననిపించుకుని ఆ కాలేజీ నుంచి బయటపడ్డాడు.

ఆ మనిషి ఇన్నేళ్ళ తరువాత ఇలా కనిపిస్తాడని ఊహించని జయంతి ఎంత నిబ్బరంగా ఉందాం అనుకన్నా, ఈ విషయాన్ని తనంత తేలిగ్గా తనని కట్టుకున్నవాడు తీసుకోడు అన్నది ఆమెకి అర్థం అవసాగింది. పన్నెండేళ్ళ వైవాహిక జీవితం, ఇద్దరు పిల్లల తల్లి అయిన తన భార్య గతం అనవసరం అనుకునే సహృదయత ఓ మగాడికి, ఓ మొగుడికి ఉంట్ఁందని ఆశించడం అత్యాశేమో అనిపించసాగింది జయంతికి.

"ఏమిటలా చూస్తున్నారు? నేనెందుకు ఎవరికీ చెప్పలేదో అర్థం అయిందా? కానీ, నాకర్థం కానిది ఏమిటంటే, అప్పుడు అంత పశ్చాత్తాపం ఒలకబోసి, తరువాత నా జోలికి రావడం మానేసిన ఆ శేఖర్ పనిగట్టుకు ఇన్నాళ్ళ తరువాత మీరెవరో తెలీకుండా ఎందుకు చెప్పాడు? మీరు ఎవరో తెలిసి చెబితే నా మీద కసి తీర్చుకోవాడనికీ, నా కాపురం పాడుచేయడానికి చెప్పాడని అనుకోవచ్చు. పాత సంగతి ఎందుకు తవ్వాడు? " సాలోచనగా చూస్తూ అంది.

"వాడు నాతో చెప్పలేదు నేనే వాణ్ణి అడిగా." కృష్ణమూర్తి అన్నాడు.

"మీరడిగారా, మీకెలా తెలుసు ఈ విషయం?" ఈసారి ఆశ్చర్యపోవడం జయంతి వంతుఅ యింది.

"మా ఇద్దరికీ కామన్‌ఫ్రెండ్ శ్రీధర్ అని ఉన్నాడులే. నేను శేఖర్ కంటే ఓ ఏడాది సీనియర్ని. నేను కాలేజీ నుంచి వెళ్ళిపోయాక జరిగిన సంఘటన ఆ మధ్య శ్రీధర్, శేఖర్ నా జూనియర్ అయినా రూమ్‌మేట్. మా ఇద్దరి స్నేహం తెలిసిన శ్రీధర్, శేఖర్ చేసిన పని చెప్పాడు. అది గుర్తువచ్చి అడిగా. పాపం వాడు నాకు తెల్సిందని చాలా సిగ్గుపడ్తూ చేసిన తప్పు చెప్పాడు.

'ఏమిటోరా ఆ అమ్మాయి నన్ను నిర్లక్ష్యం చేసి రెచ్చగొట్టిందన్న అహంతో, ఉడుకు రక్తం వేడిలో, ముందూ వెనుకలు ఆలోచించకుండా ఆవేశంతో అమ్మాయి జీవితంతో ఆడుకున్నాను. ఆ వయసులో పొగరు, వగరు ప్రతీకారం తీర్చుకునేంతవరకు దుగ్ధ చల్లారలేదు. ఇప్పుడు ఆలోచిస్తే ఎంత సిగ్గుగా ఉంటుందో, తప్పు చేసిన పశ్చాత్తాపం నన్ను నిలవనీయలేదు. చేసిన తప్పుకి పరిహారంగా ఆ అమ్మాయిని పెళ్లాడదాం అనుకున్నాను. కానీ, ఆమె అభిమానవతి. ఛీకొట్టి తన జోలికి వస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దాంతో ఆ ప్రయత్నం మానుకున్నాను. ఈ శ్రీధర్‌గాడు ఇన్నాళ్ళు తరువాత పనిగట్టుకుని నీకు చెప్పడం ఏమిటి అంటూ బాధపడ్డాడు, సిగ్గుపడ్డాడు. ఇదివరకటి శేఖర్ కాదులే వాడు ఇప్పుడు. "మిత్రుడు గురించి సానుభూతి

చూపాడు.

"ఓహో, స్నేహితుడు వెధవ పనిచేసినా మీకేం కోపం రాలేదు. కానీ, నా తప్పు లేకపోయినా నన్ను నిలేస్తున్నారు, అంతేలెండి, పరాయి మగాడి ఇంట ఉన్నందుకే అగ్నిపరీక్ష పెట్టిన శ్రీరామచంద్రుడి వారసులుగా మీరు, మగాడి తప్పు లెక్కలోకి రాదు. కానీ, ఆడదాని తప్పు భూతద్దంలో చూడడానికి ప్రయత్నిస్తారు" వ్యంగ్యంగా అంది.

కృష్ణమూర్తి తలదించుకొని అన్నం కెలుకుతూ కూర్చున్నాడు. "ఏమిటి ముఖం అలా పెట్టారు? ఇంకా జరిగిందానికి నా తప్పులేదనిపించడం లేదా?"

"నీ తప్పు ఉన్నా లేకపోయినా, కావాలని చేయకపోయినా, జరగాల్సిన అనర్థం జరిగింది. పోవాల్సింది పోయింది కదా."

"ఏమిటి పోయింది? చెప్పండి. ఆహాఁ చెప్పండి, శీలం పోయిందా. పవిత్రత పోయిందా. మానం మంటగలిసిందా? ఏం పోయిందో డొంకతిరుగుడు లేకుండా స్పష్టంగా చెప్పండి" తీక్షణంగా అంది.

కృష్ణమూర్తి జవాబివ్వలేదు.

"అయితే, పోయిందానికి పాపపరిహారం ఏమిటిది? అగ్నిప్రవేశం చెయ్యాలా సీతమ్మవారిలా? చేస్తే కాలి బూడిద అవుతా, గానీ బతికి బయటపడను. నిప్పులో దుమికినా నా శీలం నిరూపనించబడదు. పాపం నాతో పన్నెండేళ్ళు కాపురం చేసినందుకు మీరూ అపవిత్రమైపోయి ఉంటారు. పదండి ఇద్దరం వెళ్ళి గంగలో మునిగి పునీతులం అయివద్దాం." హేళనగా ఎత్తిపొడిచింది కృష్ణమూర్తి మౌనాన్ని సహించలేక.

కృష్ణమూర్తి ఉక్రోషంగా లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

కృష్ణమూర్తి మగమనస్తత్వం అర్థమైంది జయంతికి. ఓ మగాడు, మొగుడి స్థానంలో ఉన్నవాడు ఈ విషయం తేలిగ్గా తీసుకోడు, కనీసం తేలిగ్గా తీసుకున్నట్టు కనపడడానికి ఇష్టం ఉండదు. పట్టించుకోకపోతే నాలుగు రోజులు పోతే అతనే సర్దుకుంటాడు అనుకుంది జయంతి.

జయంతి ఆలోచన తప్పన్నట్టు. అంత సులువుగా క్షమించను అన్నట్టుగా నెల, రెండు నెలలయినా కృష్ణమూర్తిలో మార్పు రాలేదు. ఒకేగదిలో ఒకే పక్కమీద పడుకున్న ఇద్దరి మధ్య యోజనాల దూరం పెరిగింది. జయంతి వండడం, పెట్టడడం, పిల్లలు, ఇంటిపని, ఆఫీసుపని పైకి అన్నీ యధావిధిగా జరుగుతున్నాయి. లోపల ఇద్దరి మధ్య జరిగేది బయటికి తెలిసే అవకాశం లేదు. పిల్లలు చిన్నవాళ్ళు, తల్లిదండ్రి మధ్య

భేదాభిప్రాయాలు అర్థం చేసుకునే వయసు లేదు వారికి. మాటా మంతి కరువై తప్పుకు తిరిగే కృష్ణమూర్తిని చూసి ఒళ్ళుమండి నిలేసింది ఓ రోజు జయంతి.

'ఏమిటి మీ ఉద్దేశంమీ ఈ ప్రవర్తనకి అర్థం ఏమిటి?

"ఏ ప్రవర్తన. ఏం నేనేం చేశాను?" ముభావంగా అన్నాడు.

జయంతి హేళనగా నవ్వింది. "అవును,ఏం చెయ్యలేదు. తిట్టలేదు. కొట్టలేదు. చాలా తెలివైన వారుగదా. సైలెంట్ టార్చర్ చేస్తున్నారు. ఈ రకంగా శిక్షించి తృప్తి పడుతున్నారు. నేను చెయ్యని తప్పుకు" కసిగా అంది.

"చూడు నేను నిన్నేమన్నా అన్నానా? మనిద్దరి మధ్యా భార్యాభర్తల బంధం తప్ప మిగతాదాన్లో మార్పేం లేదుగదా. పిల్లల కోసం మనం కలిసి ఉండక తప్పదు గదా. ఇంతకంటే సర్దుకోవడం నావల్లకాదు."

"ఓహో, పిల్లల కోసం కలిసి ఉన్నారన్నమాట. లేకపోతే నన్నీపాటికి ఇట్లోంచి తన్ని తగలేసేవారు గాబోలు, పరవాలేదు. పిల్లల కోసం మీరంతంత త్యాగాలు చెయ్యక్కరలేదు. నాకూ ఉద్యోగం ఉంది. పిల్లల్ని నేను పోషించుకోగలను. ఈ చెడిపోయిన దానికి డైవోర్స్ ఇచ్చి మీరు మహారాజులా రెండో పెళ్ళి చేసుకోండి." ఉక్రోషంగా అంది.

"చెడిపోయావని అనలేదు. కానీ, చూస్తూ, చూస్తూ నీతో... నావల్ల కావడంలేదు. నాకేం పెళ్ళాడాలన్న కోరిక లేదు. మన వల్ల పిల్లలు బాధపడకూడదు. నన్నర్థం చేసుకో. ఈ నాలుగు గోడలు దాటి వెళ్ళాల్సిన అవసరంలేదు."

"హుం ఎంతటి అవకాశవాదులు మీరు. ఇప్పుడు భార్య ఇలాంటిదని తెలిస్తు అవమానం. ఇప్పుడు భార్యని ఇంట్లోంచి పంపించేస్తే లోకం ఏమంటుదోనని భయం. ఇల్లాలు ఇంట్లో లేకపోతే ఎదుర్కొనే ఇబ్బందులు తలుచుకుని భయం. పిల్లలని, ఇంటిని చూసుకోవడం రేపు పిల్లల భవిష్యత్తు తల్లి ఇలాంటిదని తెలిస్తే ఏమవుతుందోనని భయం. ఇన్ని భయాలతో దయతలిచి నన్ను ఇంట్లో ఉండనిస్తున్నారు. హుం.. నేనేం మగాడి పొందుకోసం మొహంవాచి ఏడుస్తున్నాననుకోకండి. ఆడదానికి భర్తనుంచి కావాల్సింది కాస్తంత ప్రేమ, అనురాగం, సానుభూతి, నేనున్నాననే భరోసా కావాలిగాని..'

"జయంతీ నన్ను అర్థం చేసుకో. మనం అనవసరంగా రొస్టు పడొద్దు. నాకు కొంత టైమియ్యి. నిన్ను వదులుకోవాలని నాకేంలేదు. నా మనఃస్థితి అర్థం చేసుకో. కాలం అన్ని గాయాలు మాన్పుతుంది."

"గాయం తగిలింది నాకయితే అది మానడానికి మీకు టైమివ్వాలి. వెల్‌సెడ్, ఎనీహౌ నన్నీ ఇంట్లో ఉండడానికి పర్మిషన్ ఇచ్చినందుకు థ్యాంక్స్ చెప్పను. ఎందుకంటే

నన్ను పొమ్మనే హక్కు మీకు లేదుగనుక. ఇది నా ఇల్లు ఇక్కడ నుంచి నన్ను పంపాలంటే కోర్టుకెక్కి విడాకులు తీసుకోవాలి మీరు. మన మధ్య భార్యాభర్తల సంబంధం లేదన్నప్పుడు ఇంక ఈ మంచం మీద పడుకోవడం అనవసరం." జయంతి విసురుగా గదిలోంచి వెళ్ళిపోయింది.

* * *

రాత్రి పదకొండు గంటలవేళ మంచి నిద్రలో ఉన్న జయంతి ఒంటిమీద చెయ్యిపడేసరికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. చేయిపట్టి లాగుతున్న కృష్ణమూర్తిని చూసి ఛీత్కారం చేస్తూ "చేయి వదలండి" తీక్షణంగా అంది చేయి విదిల్చికొట్టి.

'జయా... ప్లీజ్ రా మన గదిలోకి. జరిగింది మర్చిపోదాం. జరిగింది ఓ పీడకలని మరిచిపోదాం." అనునయిస్తూ అన్నాడు. జయంతి అతణ్ణి ఓ పురుగుని చూసినట్టు తిరస్కారంగా చూసింది. "వెళ్ళండిక్కడి నుంచి.మరెప్పుడూ నా ఒంటిమీద చెయ్యివేసే సాహసం చెయ్యకండి. జరిగింది మీ అవసరం కోసం మీరు మరిచిపోదలచినా నేను మరిచిపోను. ఈ మాట ఆ రోజు.. ఆర్నెల్ల క్రితం అనుంటే తప్పకుండా మర్చిపోయేదాన్ని. నౌ ఇటీజ్ టూ లేట్. ఆడదాని అవసరం కోసం ఆత్మాభిమానం మీరొదులుకోగలరమేమో కానీ, చేసిన అవమానం నేను మరిచిపోలేను. వెళ్ళండిక్కడ నుంచి"చాలా కటువుగా అంది.

"ప్లీజ్ నీకోపం నాకర్థం అయింది జయా. నా మనసుకి నచ్చచెప్పుకోవడానికి నాకు టైము కావాలన్నాగా, నన్ను నా మనఃస్థితిని అర్థం.."

"అర్థం చేసుకోవడానికేం లేదు. అర్థం చేసుకుని ఉండాల్సింది మీరు. నా నిస్సహాయ స్థితిని, నా అవమానాన్ని, నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిన ఆ సంఘటనకి సానుభూతి చూపాల్సింది పోయి చేయని నేరానికి శిక్ష వేశారు. ఆనాడు జరిగింది మీ పరిభాషలో నా మానభంగం అయివుండవచ్చు. ఈనాడు ఇది నా అభిమానభంగం. నా దృష్టిలో శేఖర్ కంటే మీరెక్కువ దోషులు. వాడు నాకేం కాడు కనుక వాడు చేసిన పని మరిచిపోగలిగాను. కానీ, కట్టుకున్న భార్యను, పన్నెండేళ్ళ కాపురం చేసిన భార్యను, మీ ఇద్దరి పిల్లల తల్లి పట్ల కనీస సానుభూతి కూడా చూపలేకపోయిన మొగుడనే మిమ్మల్ని మాత్రం క్షమించను. అభిమానభంగం జరుగనీయను. కనీసం ఆ తృప్తి అయినా నాకు దక్కాలి. మానం పోయినా అభిమానం పోగొట్టుకోను ఈసారి. మరోసారి ఈ ప్రసక్తి తెచ్చినా, నా ఒంటిమీద చేయివేసినా సహించను. వెళ్ళండిక్కడినుంచి" చాలా స్థిరంగా తలుపు చూపిస్తూ అని అటు తిరిగి పడుకుంది జయంతి.

◆ ఇండియా టుడే, నవంబర్ -98